
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 26 । జనవరి । 2025



సోమశిలలో 68.325 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 68.325 టీఎంసీలు ఉన్నాయి. 1,861 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువ కాలువలకు 3,950 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.83,000
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,555
3శాతం జీఎస్టీతో	రూ.7,782
నవర (8గ్రా)	రూ.62,256

గరిష్ఠం/కనిష్ఠం
32.1 /21.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 63 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వైద్యశాఖలో పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్యారోగ్యశాఖలో ఎన్‌హెచ్‌ఎం విభాగంలో ఆత్మకూరు జిల్లా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ పోస్టును కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఈ నెల 28న జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌ఓ సుజాత శనివారం ఒక ప్రకటనలో వివరించారు. ఎంబీబీఎస్ పూర్తి చేసి ఉండాలన్నారు. జీతం నెలకు రూ.61,960 ఉంటుందని తెలిపారు. వివరాలకు sps nellore.ap.gov.in/notice/recrutement వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని కోరారు.

ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

ఆత్మకూరులోని డైస్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఆడియాలజిస్ట్ కమ్ స్పీచ్ థెరపిస్ట్–1, డెంటల్ టెక్నీషియన్ పోస్టు–1కు సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేశామని డీఎంహెచ్‌ఓ తెలిపారు. వివరాలను sps nellore.ap.gov.in/notice/recrutementలో ఉంచామన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే సోమ, మంగళవారాల్లో లిఖిత పూర్వకంగా తెలపాలన్నారు.

హైరింగ్ విధానంలో వాహనం కావాలి

నెల్లూరులోని డైస్ సెంటర్‌లో పేషెంట్లను రవాణా చేయుటకు హైరింగ్ విధానంలో వాహనం కావాలని డీఎంహెచ్‌ఓ తెలిపారు. వాహనం సీట్లు కెపాసిటీ 8 వరకు ఉండాలని కోరారు. నెలకు రూ.60,000 చెల్లిస్తామని తెలిపారు. వివరాల కోసం డైస్ మేనేజర్‌ను మొబైల్ నంబర్ 8466959902లో సంప్రదించాలని కోరారు.

ఓటుతోనే ప్రజాస్వామ్యం



సీనియర్ ఓటర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, వీసీ, జేసీ తదితరులు

నెల్లూరు (అర్బన్): ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుంటేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని కలెక్టర్ ఆనంద్, వీఎస్‌యూ ఉపకులపతి విజయకుమార్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులు, వలంటీర్లు మానవహారం నిర్మించారు. అనంతరం తిక్కన ప్రాంగణంలో సభ జరిగింది. వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్‌ను నిర్దేశించేది యువత మాత్రమేనన్నారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారు 60 వేల మంది ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. ఇక మీదట ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించడమే కాకుండా అక్కడికక్కడే ఓటు నమోదు చేసుకునేలా చర్యలు చేపడుతామన్నారు. సీనియర్ ఓటర్లు నరసయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, కృష్ణమ్మ, సుగుణమ్మ, కాంతారావు తదితరులను సన్మానించారు. జిల్లా స్థాయిలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్‌ఓ ఉదయభాస్కర్‌రావు, ఆర్డీఓ అనూష, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, ఆర్‌ఐఓ శ్రీనివాసులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మేయర్ భర్తపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): మేయర్ స్రవంతి భర్త జయవర్ధన్‌పై దర్గామిట్ట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కమిషనర్ సీసీ ప్రవీణ్‌కుమార్ మేయర్ ఛాంబర్‌లో కంప్యూటర్ ఆన్‌చేసి ప్రింట్ అవుట్‌లు తీస్తుండగా మేయర్ భర్త జయవర్ధన్ అతనితో గొడవపడి ఛాంబర్‌లో నిర్బంధించారు. తన విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా తనను నిర్బంధించిన జయవర్ధన్, తనపై దాడిచేసిన మరో ఇద్దరిపై ప్రవీణ్‌కుమార్ దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు జయవర్ధన్‌ను అరెస్ట్ చేశారు. మేయర్ ఫిర్యాదుపై పోలీసులు విచారిస్తున్నారు.

310 మందికి ఉత్తమ సేవా పురస్కారాలు

- వీరిలో నలుగురే జిల్లాస్థాయి అధికారులు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ శాఖల్లోని అధికారులు, సిబ్బందికి, స్వచ్ఛంద సేవకులకు సంబంధించి మొత్తం 310 మందికి కలెక్టర్ ఆనంద్ 76వ గణతంత్ర దిన వేడుకల సందర్భంగా అవార్డులు ప్రకటించారు. అందులో కేవలం నలుగురు మాత్రమే జిల్లా అధికారులున్నారు. ఏటా 450 నుంచి 500 మందికి పైగా అవార్డులు ప్రకటించేవారు. ఇందులో సిఫార్సులు చేసి అవార్డులు తెచ్చుకున్న వారు ఉండేవారు. అయితే ప్రస్తుత కలెక్టర్ ఆనంద్ అవార్డులకు తొలిసారిగా కోత విధించారు. మొదట 250 మందికి మించకుండా అవార్డుల జాబితా తయారు చేయాలని ఆదేశించారు. చివరికి 310 మందికి అవార్డులను ప్రకటించారు. వీరందరికీ ఆదివారం నెల్లూరు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే గణతంత్ర వేడుకల సందర్భంగా కలెక్టర్ అవార్డులు అందజేస్తారు. ఇందులో ఐఏఎస్ అధికారి ఎం.సూర్యతేజ (నెల్లూరు మున్సిపల్ కమిషనర్), జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి, డ్వామా పీడీ గంగాభవాని, నెల్లూరు ఆర్డీఓ అనూష ఉన్నారు. కలెక్టర్ కార్యాలయం నుంచి 31 మంది, పోలీసుశాఖ నుంచి 50 మంది ఇలా అన్ని శాఖల నుంచి అవార్డులు అందుకోనున్నారు.

దేశ సేవలో దేవిశెట్టిపల్లి



ఆ ఊరులోని ప్రతి ఇంట్లో దేశ భక్తి ప్రజ్వరిల్లుతోంది. దేశ భద్రతే లక్ష్యంగా ఆర్మీ సేవకు అంకితమైంది. ప్రతి ఇంటి నుంచి ఇద్దరు.. ముగ్గురు చొప్పున ఆర్మీతో పాటు నేవీ, ఎయిర్‌ఫోర్స్ తదితర విభాగాల కొలువుల్లో కొనసాగుతున్నారు. జిల్లా సరిహద్దులోని ఓ మారుమూల గ్రామం దేవిశెట్టిపల్లి. నాలుగున్నర దశాబ్దాల క్రితం రేనాటి వెంకటసుబ్బయ్య స్ఫూర్తి.. ఆ ఊరు లక్ష్యాన్ని, గమనాన్ని మార్చేసింది.

ఆర్మీ ఉద్యోగాల పుట్టినిల్లు

- ఆ ఊరంతా 120 కుటుంబాలు
- వివిధ దళాల్లో 150 మంది వరకు సేవలు

సీతారామపురం: జిల్లా సరిహద్దు ప్రాంతమైన సీతారామపురం మండలంలోని మారుమూల గ్రామం దేవిశెట్టిపల్లి. దేశ భక్తికి, దేశ భద్రతకు ఆ ఊరు అంకితమైంది. ఆ ఊరి జనమంతా వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. నాలుగున్నర దశాబ్దాల క్రితం వరకు ఆ ఊరి జనం కనీసం మండల కేంద్రం దాటి కూడా బయటకు వెళ్లిన పరిస్థితి లేదు. సాగునీటి వసతులు లేక.. వర్షాలు లేక వ్యవసాయం కూడా అంతంత మాత్రంగా సాగుతున్న తరుణంలో 1977లో ఆ పల్లెకు చెందిన రేనాటి వెంకటసుబ్బయ్య ఉపాధి కోసం గోవా వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ మిలటరీలో ఎంపికలు జరుగుతుండడంతో వాటిలో పాల్గొన్న ఆయన టెలికం లైన్‌మెన్‌గా ఎంపికయ్యాడు. ఆయన స్వగ్రామానికి మిలటరీ దుస్తుల్లో రావడంతో ఆ గ్రామ యువతను బాగా ఆకర్షించింది. కొద్ది రోజులు గ్రామంలో ఉన్న ఆయన అక్కడి పరిస్థితులను స్థానికులకు వివరిస్తుండడంతో మిగిలిన వారి మనస్సుల్లో కూడా మిలటరీలో చేరాలన్న బీజం పడింది. తర్వాత గోగుల బాలవెంగయ్య ఆర్మీలో చేరి మిగతా యువతను కూడా ఆర్మీలో చేరేలా ప్రోత్సహించారు. ఆర్మీలో కొలువులు సాధించేందుకు ప్రాథమిక అర్హత పదో తరగతి, ఇంటర్ పాస్ కావడంతో పట్టుదలగా చదవడంతోపాటు శారీరక సౌష్టవంపై కూడా దృష్టి సారించారు. ఇలా ఒకరిని చూసి మరొకరు ప్రేరణ పొంది ఆర్మీలో చేరడం ప్రారంభించారు. మొదట ఒకరిద్దరితో మొదలైన ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగింది. ప్రస్తుతం దేవిశెట్టిపల్లికి చెందిన సుమారు 70 మంది ఆర్మీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. త్రివిధ దళాలు, పోలీసులుగా ఉన్న వారిని కలిపితే 150 మంది వరకు ఉన్నారు. మరికొందరు విశ్రాంత సైనికులుగా గ్రామంలో ఉన్నారు.

ఉద్యోగ విరమణ తర్వాత వ్యవసాయం..

ఆర్మీలో వివిధ విభాగాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ తర్వాత అందరూ వ్యవసాయంలో స్థిరపడుతున్నారు. ఆ పల్లె వాతావరణం క్రమశిక్షణకు మారుపేరుగా ఉంటుంది. అందరూ కలిసిమెలిసి ప్రతి సంబరాన్ని సంతోషంగా జరుపుకుంటుంటారు. పరిసరాలు కూడా ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంటాయి.

"దేశాన్ని ప్రేమించాలి"



ప్రతి ఒక్కరూ కుటుంబాన్ని ప్రేమించినట్టే దేశాన్ని ప్రేమించాలి. ఆర్మీలో పనిచేయడం దేశ భక్తిగా భావించాలి. గ్రామం నుంచి ఎక్కువ మంది యువత ఆర్మీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు. అందుకు తగిన సూచనలు, సలహాలు తీసుకొని రాణిస్తున్నారు.

– ఆర్‌వీఎస్ రాయుడు, రిటైర్డ్ సుబేదార్ మేజర్

"దేశ సేవ చేయడం అదృష్టం"



పల్లెటూరులో పుట్టి ఆర్మీలో ఉద్యోగం సాధించి దేశ సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా. ఆర్మీ ఉద్యోగాలపై యువత ఆకర్షితులై దేశ సేవలో పాలు పంచుకోవాలి. మా ఊరిలోని ఎంతో మంది ఆర్మీలో పనిచేస్తుండడంతో నేను కూడా అందులో చేరి విధులు నిర్వహిస్తున్నాను.

– డాకారపు రవి, హవల్దార్

"యువత ముందుకు రావాలి"



అన్ని ఉద్యోగాలకన్నా ఆర్మీ ఉద్యోగం భిన్నం. యువత ఆర్మీలో చేరేందుకు ముందుకు రావాలి. దేశానికి సేవ చేసే భాగ్యం కొందరికే సాధ్యపడుతున్నందున యువత ఆ దిశగా ముందుకు సాగుతూ పోటీ పడాలి. దేశ సేవలో తరిస్తుండడంతో వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబానికి గౌరవం దక్కుతుంది.

– పులి శ్రీనివాసులు, నాయక్



దేవిశెట్టిపల్లి గ్రామ వ్యూ



రేనాటి వెంకటసుబ్బయ్య (తొలిసారిగా ఆర్మీలో చేరిన వ్యక్తి)

ఇంటింటికీ ఇద్దరు ముగ్గురు..

దేవిశెట్టిపల్లి.. ఆర్మీ ఉద్యోగులకు పుట్టినిల్లుగా చెప్పుకోవచ్చు. ఈ గ్రామంలో 120 కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. అయితేనేం.. ఇంటికి ఒకరిద్దరు, ముగ్గురు చొప్పున దేశ సైన్యంలో పని చేస్తున్నారు. ప్రస్తుతం సుమారు 70 మంది ఆర్మీలో పనిచేస్తున్నారు. సుబేదార్‌గా, నాయక్ సుబేదార్‌గా, హవల్దార్లుగా మరికొందరు పని చేస్తున్నారు. మరో 50 మందికి పైగా ఆర్మీలో సివిలియన్ ఉద్యోగాల్లో ఉన్నారు. నేవీలో ఇద్దరు, ఎయిర్‌ఫోర్స్‌లో ఆరుగురుతోపాటు గోవాలో పోలీసులుగా నలుగురు, పీడబ్ల్యూడీ విభాగంలో మరికొందరు ఉద్యోగాలు చేస్తున్నారు.



పహారా కాస్తున్న సైనికులు

ఆర్మీకి పోటీపడుతుంటారు..

ఆ ఊరిలో యువకులు ఆర్మీలో స్థానం సంపాదించేందుకు పోటీ పడుతుంటారు. బతుకుదెరువు కావచ్చు. ఫ్యాషన్ కావచ్చు. మరో కుటుంబంతో పోటీకావచ్చు.. ఏదైనా పదో తరగతి ఉత్తీర్ణత చెందిన దేవిశెట్టిపల్లి గ్రామ యువకులు ఆర్మీలో చేరేందుకు ప్రయత్నాలు సాగిస్తుంటారు. మిలటరీలో ఉద్యోగం చేస్తున్న వారి కుటుంబ సభ్యుల నేపథ్యంతో పాటు దేశ సేవలో తరించాలన్న యువకుల ఆసక్తి ఆర్మీ వైపు అడుగులు వేసేలా చేస్తోంది.

అవార్డులు అందుకున్న జిల్లా అధికారులు




సీఎస్ విజయానంద్ నుంచి అవార్డు అందుకుంటున్న శీనానాయక్, గోళ్ల వెంకటేశ్వర్లు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తమ సేవలందించినందుకు నలుగురు అధికారులు అవార్డులు అందుకున్నారు. శనివారం విజయవాడలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో సీఎస్ కె.విజయానంద్ చేతుల మీదుగా తెలుగుగంగ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ కె.శీనానాయక్ అవార్డుతో పాటు రూ.15 వేలు నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందుకున్నారు. కృష్ణా జిల్లా జగ్గయ్యపేట రిటర్నింగ్ అధికారిగా 2024లో సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తమ సేవలందించినందుకు మంత్రి నారాయణ ఓఎస్‌డీగా పని చేస్తున్న నెల్లూరుకు చెందిన డిప్యూటీ కలెక్టర్ గోళ్ల వెంకటేశ్వర్లు కూడా నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందుకున్నారు. మనుబోలు తహసీల్దారు సుబ్బయ్య అవార్డు, నగదు బహుమతి అందుకున్నారు. ఉదయగిరి బీఎల్వో హజరత్, కావలి బీఎల్వో నాగార్జున నెల్లూరు జిల్లా నుంచి అవార్డులు అందుకున్నారు.

ఎన్‌ఎంసీలో
గరం గరం

- మేయర్ పేషీలోకి అనుమతి లేకుండా కమిషనర్ సీసీ ప్రవేశం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మేయర్ దంపతులు
- ఘటనపై పోలీసులకు సీసీ, మేయర్ వేర్వేరుగా ఫిర్యాదు



తన పేషీలోకి ఎందుకు వచ్చావంటూ సీసీ ప్రవీణ్ కుమార్‌ను ప్రశ్నిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగర పాలక సంస్థ(ఎన్‌ఎంసీ) మేయర్ పొట్లూరి స్రవంతి పేషీకి కమిషనర్ సీసీ వచ్చి ప్రింట్ అవుట్లు తీసుకోవడంపై శనివారం వివాదం చెలరేగింది. మేయర్ కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. ఇది కార్పొరేషన్ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. ఎన్‌ఎంసీ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో కమిషనర్ సూర్యతేజ, ఇతర అధికారులు, సిబ్బందితో శనివారం ఉదయం 9 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో కమిషనర్ సీసీ ప్రవీణ్‌కుమార్ సమావేశ మందిరం నుంచి మేయర్ పేషీ రూంకు వచ్చి అక్కడ ఉన్న మేయర్ ఫొటోగ్రాఫర్‌ను రెండు ప్రింట్ అవుట్లు తీసుకోవాలని అడిగారు. అతను సరేననడంతో కంప్యూటర్ ముందు కూర్చుని సిస్టమ్‌ను ఆన్ చేశాడు. అదే సమయంలో మేయర్ భర్త జయవర్ధన్ మేయర్ ఛాంబర్‌లోకి వెళుతూ పేషీరూంలో సిస్టమ్ ముందు కూర్చుని ఉన్న సీసీ ప్రవీణ్‌కుమార్‌ను చూసి ఇక్కడ ఏం చేస్తున్నావు? అసలు ఈ రూంలోకి అనుమతి లేకుండా ఎందుకు వచ్చావు అంటూ ప్రశ్నించారు. వెంటనే సెక్యూరిటీని పిలిచి మేయర్ వస్తున్నారంటూ సీసీని లోపలే ఉంచి పేషీ రూం తలుపులు మూయించారు. ఇంతలో మేయర్ స్రవంతి వచ్చి సీసీ ప్రవీణ్‌కుమార్‌ను ఇక్కడ నీకేంటి పని అంటూ నిలదీశారు. నా అనుమతి లేకుండా నా పేషీలోకి ఎందుకు వచ్చావంటూ ప్రశ్నించారు. ప్రింట్ అవుట్లు తీసుకునేందుకు వచ్చానని సీసీ సమాధానమిచ్చారు. వెంటనే మేయర్ ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చి విచారించారు. ఈ విషయం కమిషనర్‌కు తెలియగానే ఆయన మేనేజర్‌ను పిలిపించి మేయర్ పేషీ రూంలో ఏం జరుగుతుందో తెలుసుకుని అక్కడున్న సీసీ ప్రవీణ్‌కుమార్‌ను తీసుకురావాలని ఆదేశించారు. మేనేజర్ వచ్చి మేయర్‌తో మాట్లాడి సీసీ ప్రవీణ్‌కుమార్‌ను తీసుకుని వెళ్లారు. అనంతరం మేయర్ స్రవంతి తన భర్తతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్ ఆనంద్‌ను కలిసి కమిషనర్‌తో పాటు ఇతర అధికారులు తాము చెప్పిన పనులు ఏ ఒక్కటీ సక్రమంగా చేయడం లేదని చెబుతూ.. మేయర్ పేషీలోకి అనుమతి లేకుండా సీసీ ప్రవీణ్‌కుమార్ ప్రవేశించిన విషయంపై ఫిర్యాదు చేశారు. కలెక్టర్ వెంటనే ఫోన్‌లో కమిషనర్‌తో మాట్లాడి మేయర్‌కు సంబంధించిన విషయంలో నిబంధనల మేరకు వ్యవహరించాలని సూచించారు. ఈ నేపథ్యంలోనే మేయర్ భర్త, మేయర్ పేషీలోని ఫొటోగ్రాఫర్‌ను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి జరిగిన సంఘటనపై విచారించారు. తన విధులకు ఆటంకం కలిగించారని మేయర్ దంపతులపై సీసీ ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు చేశారు. మేయర్ స్రవంతి కూడా తన అనుమతి లేకుండా ప్రవీణ్‌కుమార్ తన పేషీ రూంకు రావడంపై ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువర్గాల ఫిర్యాదులను స్వీకరించారు.

జైల్ సూపరింటెండెంట్‌పై అవినీతి ఆరోపణలు?

- సామాజిక మాధ్యమాల్లో ఆడియో వైరల్
- వాయిస్ తనది కాదన్న రాజారావు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు జిల్లా సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాజారావుపై సామాజిక మాధ్యమాల వేదికగా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. సూపరింటెండెంట్‌గా రాజారావు సుమారు ఆరు నెలల కిందట బాధ్యతలు చేపట్టారు. ఓ కేసులో రిమాండ్ నిమిత్తం జైలుకు వచ్చిన రాకేష్ ఇటీవల జైలు నుంచి విడుదలయ్యారు. సూపరింటెండెంట్‌తో రాకేష్ నగదు, మద్యం అందించిన విషయాలు చర్చించిన సంభాషణతోపాటు తనకు తెలిసిన వారు జైలుకు వస్తున్నారని వారిని బాగా చూసుకోవాలని, పండ్లు ఇవ్వాలని, ఇంకా కావాలంటే నగదు ఇస్తానన్న విషయాలకు సంబంధించి సంభాషణల ఆడియో వైరల్ అయింది. ఈ విషయమై రాజారావును వివరణ కోరగా సోషల్ మీడియాలో, కొన్ని చానల్స్‌లో వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. ఆడియోలో ఉన్న వాయిస్ తనది కాదన్నారు. ఓ ఖైదీ ప్రవర్తన సరిగా లేకపోవడంతో కొద్ది రోజుల కిందట రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించామని, అతనితో పాటు జైల్లో ఉన్న కొందరు ఇటీవల విడుదలయ్యారని, వారే తనపై కక్ష పెంచుకుని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు. దీనిపై విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను కోరనున్నట్లు ఆయన చెప్పారు.

రైల్వే డీఎస్పీగా మురళీధర్ బాధ్యతల స్వీకరణ



రైల్వే డీఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న మురళీధర్

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు రైల్వే డీఎస్పీగా జి.మురళీధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రైల్వే అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మురళీధర్ 1991 బ్యాచ్ ఎస్సై. ఆయన రాయలసీమ జిల్లాల్లో ఎస్సైగా, సీఐగా, డీఎస్పీగా పని చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో నెల్లూరు రైల్వే డీఎస్పీగా నియమితులయ్యారు. మురళీధర్ మాట్లాడుతూ రైళ్లల్లో నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గణతంత్ర వేడుకలకు ముస్తాబు



ఓపెన్ టాప్ జీప్ నుంచి పరిశీలిస్తున్న ఎస్పీ

- పోలీసు కవాతు మైదానంలో రిహార్సల్స్‌ను పరిశీలించిన ఎస్పీ


నెల్లూరు (క్రైమ్): 76వ గణతంత్ర దినోత్సవానికి నెల్లూరు నగరంలోని పోలీసు కవాతు మైదానం ముస్తాబైంది. ఆదివారం నిర్వహించే వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం పోలీసు కవాతు మైదానంలో సిబ్బంది నిర్వహించిన గణతంత్ర దినోత్సవ కవాతు రిహార్సల్స్‌ను ఎస్పీ జి. కృష్ణకాంత్ పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కృష్ణకాంత్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవానికి విచ్చేసే ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, విద్యార్థులు, ప్రజలకు అసౌకర్యం కలగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలన్నారు. వాహనాలను నిర్దేశిత ప్రాంతంలోనే పార్కింగ్ చేయించి ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరిని డీఎఫ్‌ఎండీ ద్వారా తనిఖీ చేసి మైదానంలోకి అనుమతించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్, ఏఆర్ ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, మునిరాజ, ఎస్‌బీ, ఏఆర్ డీఎస్పీలు ఎ. శ్రీనివాసరావు, చంద్రమోహన్, ఆర్‌ఐలు అంకమరావు, హరిబాబు, రాజారావు, పాల్‌రాజు, ఎస్‌బీ–1 ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఆలయానికి రూ.7.67 లక్షల రాబడి

వలేటివారిపాళెం: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని మాలకొండలో కొలువైన మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వివిధ రూపాల్లో రూ.7.67 లక్షల రాబడి వచ్చినట్లు ఈఓ సాగర్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కుంకుమార్చన సేవల ద్వారా రూ.13,440, తలనీలాలు రూ.26,600, ప్రత్యేక దర్శనం రూ.1,78,200, లడ్డూ ప్రసాదాలు రూ.1,63,420 అన్నదానం రూ.3,40,073 , రూమ్ అద్దెల ద్వారా రూ.26,990 వచ్చినట్లు ఈఓ వివరించారు.

బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య

- ఒత్తిళ్లు తాళలేకపోతున్నానని వేదన
- భార్యతో పలుమార్లు చెప్పుకొన్న వైనం
- ఉరేసుకుని బలవన్మరణం



మృతుడు శేఖర్

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో ఒత్తిళ్లు తాళలేక బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన న్యూమిలటరీ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... న్యూమిలటరీ కాలనీ సెంట్రల్ పార్క్ అపార్ట్‌మెంట్‌లో ఎం.శేఖర్(39), భాగ్యలక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి పదేళ్ల కిందట వివాహమైంది. వారికి కుమారుడున్నాడు. శేఖర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సీనియర్ మేనేజర్. ఆయన ఏడాదిన్నరగా పొదలకూరురోడ్డులోని బ్యాంకులో విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ఒత్తిళ్లు తాళలేకపోతున్నానని, చనిపోవాలని ఉందని శేఖర్ భార్యతో పలుమార్లు అనడంతో ఆమె ఓదారుస్తూ వచ్చింది. శనివారం శేఖర్ తన కుమారుడితో కలిసి ఇంట్లో ఉండగా భాగ్యలక్ష్మి పేరెంట్స్ మీటింగ్ కోసం కుమారుడు చదువుతున్న స్కూల్‌కు వెళ్లారు. కుమారుడు హాల్‌లో ఉండగా శేఖర్ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఫ్యాను హుక్కుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్కూల్ నుంచి భాగ్యలక్ష్మి భర్తతో మాట్లాడేందుకు ఫోన్ చేయగా కుమారుడు ఫోన్ లిఫ్ట్‌చేసి శేఖర్‌కు ఇచ్చేందుకు పడక గదిలోకి వెళ్లాడు. తండ్రి ఉరివేసుకుని ఉండటాన్ని గమనించి విషయాన్ని తల్లికి చెప్పాడు. దీంతో భాగ్యలక్ష్మి హుటాహుటిన ఇంటికి చేరుకుని వాచ్‌మెన్ సహాయంతో భర్తను కిందకు దించి 108కు ఫోన్ చేశారు. 108 సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని శేఖర్‌ను పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ మేరకు బాధితురాలు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్‌ఐ ముత్యాలయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

వీఎస్‌యూ విద్యార్థులకు అభినందన



వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిశోధక విద్యార్థులను ఇన్‌చార్జి వీసీ విజయభాస్కర్‌రావు శనివారం అభినందించారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ సదస్సు మైక్రోబయో వరల్డ్‌ను గురు, శుక్రవారాల్లో నిర్వహించారు. ఫుడ్ టెక్నాలజీ విభాగ అధ్యాపకుడు డాక్టర్ సాయినాథ్ పర్యవేక్షణలో నాగరాజు సమర్పించిన పరిశోధన పత్రం ప్రశంసలు పొంది ఉత్తమ అవార్డును దక్కించుకుంది. బయో టెక్నాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్మయి పర్యవేక్షణలో పరిశోధన విద్యార్థి కృష్ణ జశ్వంత్ సమర్పించిన పరిశోధన పత్రానికి గుర్తింపు లభించింది. దీంతో వీరిని అభినందించారు.

కోలుకున్న నర్సింగ్ కళాశాల విద్యార్థులు

నెల్లూరు(అర్బన్): ఫుడ్ పాయిజనింగ్‌తో ఇబ్బంది పడిన దుర్గా నర్సింగ్ కళాశాల విద్యార్థుల ఆరోగ్యం ప్రస్తుతం బాగుందని డీఎంహెచ్‌ఓ సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రమౌళీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్లు, ప్రత్యేక టీమ్‌ను అక్కడికి శుక్రవారం సాయంత్రం పంపానని చెప్పారు. సంక్రాంతి సెలవుల అనంతరం కేరళ నుంచి వచ్చిన విద్యార్థులు మాంసంతో చేసిన ఊరగాయను తినడంతో పది మందికి ఫుడ్ పాయిజనింగ్ అయిందనే విషయాన్ని తమ బృందం తెలుసుకుందన్నారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, యాజమాన్యంతో మాట్లాడి తగు సలహాలు, జాగ్రత్తలను చెప్పామని పేర్కొన్నారు. పెద్దాస్పత్రిలో అడ్మిటైన వారు డిశ్చార్జి కావడంతో తాను వెళ్లలేకపోయానని వివరించారు.

పొగాకు బ్యారన్ దగ్ధం



కొండాపురం: మండలంలోని సత్యవోలు పంచాయతీ అగ్రహారంలో పొగాకు బ్యారన్ దగ్ధమైన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మార్తుల పెదవెంకటేశ్వర్లుకు చెందిన బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేయసాగారు. ఈ క్రమంలో ఆకు గొట్టాలపై పడి మంటలు వ్యాపించాయి. దీంతో వింజమూరు అగ్నిమాపక సిబ్బందికి స్థానికులు సమాచారం అందజేశారు. వారొచ్చేలోపే బ్యారన్ పూర్తిగా దగ్ధమైంది. ఘటనలో రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. మంటలకు బ్యారన్ గోడలు బాగా కాలిపోయాయి. నీళ్లు చల్లడంతో ఇవి కూలిపోయాయి. మరోవైపు ఇది జాయింట్ కావడంతో పక్కనే ఉన్న చిన వెంకటేశ్వర్లుకు చెందిన బ్యారన్‌కు నిప్పంటుకుంది. దీంతో అందులోని టైర్లు, ఆకు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దాదాపు రూ.మూడు లక్షల నష్టం సంభవించిందని స్థానికులు తెలిపారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఫలితాల విడుదల

నెల్లూరు (టౌన్): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులకు సంబంధించిన లోయర్, హయ్యర్ గ్రేడ్ డ్రాయింగ్, హ్యాండ్లూమ్, వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్ష ఫలితాలను విడుదల చేశారని డీఈఓ బాలాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కుల జాబితాలు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లతో దర్గామిట్టలోని జెడ్పీ హైస్కూల్లోని పరీక్షల విభాగాన్ని సంప్రదించాలని సూచించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

బిట్రగుంట: చట్టాలపై మహిళలు అవగాహన పెంపొందించుకొని రక్షణ పొందాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి వాణి పేర్కొన్నారు. విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా కప్పరాళ్లతిప్పలోని వెలుగు కార్యాలయంలో మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సును జాతీయా మహిళా కమిషన్, జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళల రక్షణ కోసం అమల్లో ఉన్న చట్టాలు, ఉచిత న్యాయసాయం పొందే విధానాలు, లోక్ అదాలత్ తదితరాలపై అవగాహన కల్పించారు. కావలి సీనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ చైర్‌పర్సన్ శోభ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విక్రమసింహ, స్పెషల్ మెజిస్ట్రేట్ పరశురామ్, లోక్‌అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు

పొదలకూరు (కిలో)



పెద్దవి	: రూ.30
సన్నవి	: రూ.18
పండ్లు	: రూ.10

ఆస్తి కోసమే కడతేర్చారు

- స్టీల్ సామాన్ల వ్యాపారి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- హతుడి రెండో కుమారుడే నిందితుడు
- ఏడుగురి అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న శ్రీనివాసరావు

కొడవలూరు: బుచ్చిరెడ్డిపాళెం మండలం చెల్లాయపాళెనికి చెందిన స్టీల్ సామాన్ల వ్యాపారి దేవళ్ల రమేష్‌ను ఆస్తి కోసమే రెండో కుమారుడు అజయ్ హత్య చేయించారని రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు తెలిపారు. కొడవలూరు పోలీస్‌స్టేషన్లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. ఆస్తి విషయమై దేవళ్ల రమేష్‌కు ఆయన చిన్న కుమారుడు అజయ్‌కు మధ్య విభేదాలున్నాయి. ఈ తరుణంలో తండ్రిని హతమారిస్తే ఆస్తంతా తనకే వస్తుందని అజయ్ భావించారు. దీంతో బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన ఏడుగురితో రూ.ఐదు లక్షల సుపారీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. స్టీల్ సామాన్ల వ్యాపార నిమిత్తం ఆటోలో నార్సురాజుపాళెం వైపునకు ఈ నెల 22వ తేదీ ఉదయం 5.30 గంటల ప్రాంతంలో బయల్దేరారు. ఈ క్రమంలో మిక్కిలింపేట క్రాస్ రోడ్డు వద్ద కార్లలో వచ్చిన కిరాయి వ్యక్తులు ఆటోను నిలిపి అందులో ఉన్న రమేష్ గొంతు నులిమి హత్యచేసి పరారయ్యారు. ఘటన స్థలానికి చేరుకున్న రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు కేసును ఛేదించేందుకు సీఐ సురేంద్రబాబు, ఎస్సైలు కోటిరెడ్డి, నరేష్‌ను మూడు బృందాలుగా నియమించారు. రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు మూడు రోజుల్లోనే కేసును ఛేదించాయి.

సహకరించిన భార్య

కిరాయి హంతకులైన ఏడుగురిలో ఐదుగుర్ని అదుపులోకి తీసుకోవడంతో పాటు కుమారుడు అజయ్, సహకరించిన మృతుడి భార్య సులోచనమ్మను అరెస్ట్ చేశామని డీఎస్పీ చెప్పారు. హత్యకు పాల్పడిన వారిలో గోళ్ల రుతేంద్ర, మందా పవన్‌కల్యాణ్, గురునాథం తిరుపతయ్య, కట్టా సుధాకర్, నక్కా కాంతారావును అరెస్ట్ చేశారు. మరో ఇద్దర్ని త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు. సీఐ, ఎస్సైలను ఎస్పీ కృష్ణకాంత్ అభినందించి రివార్డులను ప్రకటించారని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి రంగోత్సవ్‌కు ఎంపిక

ఇందుకూరుపేట: ఢిల్లీలో త్వరలో నిర్వహించనున్న జాతీయ స్థాయి రంగోత్సవ్‌కు జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడారు. గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఆయేషా చేతిరాత విభాగంలో.. పల్లిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న దీక్షిత, మేఘన రంగోలి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు.



ఆయేషా



దీక్షిత, మేఘన

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 138
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 246
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 270
లేయర్ చికెన్	: 145

ప్రియురాలితో పెళ్లి చేయలేదనే అక్కసుతో..

- ఆమె తండ్రిని హతమార్చిన ప్రియుడు

నెల్లూరు(క్రైమ్): ప్రియురాలితో పెళ్లి చేయలేదనే కక్షతో ఆమె తండ్రిని ప్రియుడు దారుణంగా హత్య చేసిన ఘటన నగరంలోని శ్రీనివాసనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. జాకీర్‌హుస్సేన్‌నగర్‌కు చెందిన మహబూబ్‌బాషా (54), కరిమున్నీసా దంపతులకు ఓ కుమార్తె ఉన్నారు. బిస్కెట్లు, రొట్టెలను తయారు చేసి బేకరీలకు సరఫరా చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన కుమార్తె, అదే ప్రాంతానికి చెందిన షాహిద్ కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. దీంతో వీరికి వివాహం చేసేందుకు ఏడాది క్రితం నిశ్చితార్థం జరిపారు. అయితే షాహిద్ పనులకెళ్లకుండా స్నేహితులతో జులాయిగా తిరుగుతుండటంతో వివాహానికి మహబూబ్‌బాషా నిరాకరించారు. పెళ్లి చేయాలని షాహిద్ పలుమార్లు ప్రాధేయపడినా.. పలువురి ద్వారా ఒత్తిడి తీసుకొచ్చినా ఫలితం లేకుండాపోయింది. దీంతో కక్ష పెంచుకున్నారు. అయన్ను అడ్డు తొలగించుకుంటే ప్రియురాలిని వివాహం చేసుకోవచ్చని భావించారు. అప్పటి నుంచి అదను కోసం వేచిచూడసాగారు. ఈ క్రమంలో పని నిమిత్తం శ్రీనివాసనగర్‌కు మహబూబ్‌బాషా వెళ్లారు. అక్కడి నుంచి ఇంటికెళ్తుండగా షాహిద్ అడ్డుకొని, కత్తితో విచక్షణరహితంగా పొడిచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన మహబూబ్‌బాషాను చికిత్స నిమిత్తం నగరంలోని రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాలకు స్థానికులు హుటాహుటిన తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందారు. సమాచారం అందుకున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా.. హాస్పిటల్‌కు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కరిమున్నీసా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా

చీటీల పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): చీటీల పేరిట పలువుర్ని మోసగించి కుటుంబంతో సహా పరారైన నిర్వాహకురాలిపై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సరస్వతీనగర్‌కు చెందిన లక్ష్మి వద్ద పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 15 మంది రూ.లక్షల్లో చీటీలను వేశారు. ఈ క్రమంలో గతేడాది డిసెంబర్ 23న తన కుటుంబంతో కలిసి ఎటో వెళ్లిపోయారు. ఆమె కోసం బాధితులు గాలించినా ప్రయోజనం లభించలేదు. దీంతో ఆమె చేతిలో మోసపోయిన ఆదిలక్ష్మి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు.

ఎల్టీ, ఫార్మసిస్ట్ తుది జాబితా విడుదల నేడు

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ విభాగంలో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్‌ల పోస్టులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఇటీవల దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఫైనల్ మెరిట్ జాబితాను ఆదివారం విడుదల చేయనున్నామని డీఎంహెచ్‌ఓ సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితాను spsnellore.ap.gov.in/notice/recruitment లో ఉంచుతున్నామన్నారు. అభ్యర్థులు తమ వివరాలను పరిశీలించుకోవాలని కోరారు.

మృతదేహానికి రీ పోస్ట్‌మార్టం

కలిగిరి: మృతదేహానికి రీ పోస్ట్‌మార్టం చేసిన ఉదంతం అయ్యప్పరెడ్డిపాళెంలో శనివారం జరిగింది. పోలీసులు, మృతుడు వేల్పుల గోపీ (35) భార్య రంజాన్ వివరాల మేరకు.. కుటుంబ కలహాల నేపథ్యంలో రంజాన్ కొంతకాలంగా జలదంకి మండలం కేశవరంలో పుట్టింట్లో ఉంటున్నారు. గోపీ మాత్రం అయ్యప్పరెడ్డిపాళెంలో ఉంటున్నారు. ఈ తరుణంలో గోపీ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారంటూ గతేడాది డిసెంబర్ 31న వదిన భూలక్ష్మి ఫోన్లో రంజాన్‌కు సమాచారమిచ్చారు. కేశవరం నుంచి వచ్చిన వెంటనే అంత్యక్రియలు జరిపించారు. కాగా భర్త మృతిపై అనుమానాలున్నాయంటూ కలిగిరి పోలీసులకు ఈ నెల 19న ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఖననం చేసిన మృతదేహాన్ని కలిగిరి ఎస్సై ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఆత్మకూరు నుంచి వచ్చిన వైద్యుడు దత్తప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు వెలికితీయించారు. అనంతరం పోస్ట్‌మార్టం నిర్వహించి శరీరభాగాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు.



ఎల్సీడీసీ సర్వే తనిఖీ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో నిర్వహిస్తున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్సీడీసీ) సర్వేను ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ శనివారం తనిఖీ చేశారు. నగరంలోని జేవీఆర్ కాలనీలో గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. సమీప ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సర్వేను పర్యవేక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. శరీరంపై ఎలాంటి మచ్చలున్నా వైద్య సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు. చర్మ సంబంధిత మచ్చలైతే వాటికి మందులిస్తామని తెలిపారు. లెప్రసీ అనుమానిత కేసులొస్తే వారికి ప్రత్యేక చికిత్సలు చేసి వ్యాధి ఉందో లేదో నిర్ధారిస్తామని వివరించారు. డీఆర్టీబీ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, వైద్యాధికారి సాయిసింధు తదితరులు పాల్గొన్నారు.



ఆటోను ఢీకొన్న లారీ

- ఐదుగురికి గాయాలు

వెంకటాచలం: ఆటోను లారీ ఢీకొనడంతో ఐదుగురు గాయపడిన ఘటన మండలంలోని సరస్వతీనగర్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. గూడూరుకు చెందిన గురవమ్మ, బుజ్జమ్మ, మల్లయ్య, శీనయ్య, ఐలేసయ్య పని నిమిత్తం ఆటోలో నెల్లూరొచ్చారు. తిరిగి బయల్దేరిన వీరిని సరస్వతీనగర్ సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొంది. ఘటనలో వీరందరూ గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వెంకటాచలంలోని క్లస్టర్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

నెల్లూరు(బృందావనం): యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని హరిద్వార్‌లోని పతంజలి యోగ్ పీఠ్ సెంట్రల్ ఇన్‌చార్జి చీఫ్ పరమార్థదేవ్ మహరాజ్ పేర్కొన్నారు. నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఉచిత సమీకృత యోగా శిబిరాన్ని పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, యోగా మిత్రమండలి జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. యోగా సాధనతో సప్తగుణాలను అధిగమించాలని చెప్పారు. దీని ద్వారా ప్రాణశక్తి శుద్ధి పొంది శరీరంలోని భాగాలన్నీ పునరుత్తేజితమవుతాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా యోగాను అందరూ సాధన చేస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తున్నారని వివరించారు. అనంతరం శిబిరానికి హాజరైన సాధకులకు యోగాసనాలతో వాటి విశిష్టతను వివరించారు. పతంజలి యోగ్ పీఠ్ రాష్ట్ర అధ్యక్షుడు బాలోజీ యోగాచార్య, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు పెంచలయ్య, అనిల్‌కుమార్, పద్మావతి, యోగా మిత్ర మండలి ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీంద్ర, గీతావైభవ్ ట్రస్ట్ నిర్వాహకుడు నజీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



యోగా సాధకులకు శిక్షణ ఇస్తున్న పరమార్థదేవ్ మహరాజ్

ఆకట్టుకున్న కాయిన్స్ ఎక్స్‌పో

నెల్లూరు సిటీ: నెల్లూరు పొర్థసారథి నగర్‌లోని ఓ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ కాయిన్స్ ఎక్స్‌పోను కలెక్టర్ ఆనంద్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజుల కాలం నాటి నాణేలు, నోట్లు, స్టాంపులు, వాటి విశిష్టతను తెలియజేసేలా కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని అభినందించారు. 20 దేశాల నోట్లు, కాయిన్స్‌ను ప్రదర్శించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఔత్సాహికులు సందర్శించారు. కాగా కార్యక్రమాన్ని ఆదివారం సైతం నిర్వహించనున్నారు. ఆర్‌ఐఓ శ్రీనివాసులు, అపుస్మా డైరెక్టర్ శ్రీధర్, శ్రీధర్స్ సీసీఈ సుధీర్, పాఠశాల డైరెక్టర్లు షణ్ముఖ ఆచారి, వెంకటాద్రి, సుధాకర్, గౌరి తదితరులు పాల్గొన్నారు.



నాణేలను తిలకిస్తున్న కలెక్టర్ ఆనంద్